కాంగ్రెస్‌లో చేరికకు వార్డు మెంబర్లలోనూ విముఖత

- టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉండటం మేకపోతు గాంభీర్యమే
- పెండింగ్ బిల్లులు ఇస్తామంటూ సర్పంచ్‌లను లాగేందుకు యత్నం
- కాంగ్రెస్ ఇక మునిగే నావ అంటున్న ఆ పార్టీ కార్యకర్తలు
- 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో ఆసక్తికర విషయాలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు మేకపోతు గాంభీర్యమేనని తెలుస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ గ్రామాలలో కనీసం వార్డు మెంబర్ స్థాయి నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరటానికి ఆసక్తి చూపటం లేదని ఆ పార్టీ గ్రామ స్థాయి వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ఇతర పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరటానికి ఆసక్తి చూపించారని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదని క్షేత్రస్థాయిలోని ఆ పార్టీ శ్రేణులే చెప్తున్నారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితిని అంచనా వేయడానికి 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదని పరిపాలనలోనూ విఫలమైందని గ్రామాల్లో చర్చ జరుగుతున్నది. వృద్ధులు రూ. 4000 పింఛన్ కోసం, మహిళలు రూ.2000 పెన్షన్ కోసం హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, తాము కూడా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశామని కార్యకర్తలు తెలిపారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నాయకులు ప్రజలను మోసం చేశారని కార్యకర్తలు భావిస్తున్నారు.

సంక్రాంతి తరువాత ఎన్నికలు!

సంక్రాంతి పండుగ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నట్టు మంత్రులు లీకులిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు గ్రామాలలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లోగెలువగలిగే నేతల కోసం ఆరా తీస్తున్నారు. కానీ ఈ సమావేశాలకు తగిన స్పందన లేదని ఆ పార్టీ కార్యకర్తలే చెప్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటివరకు ఎమ్మెల్యేలకు రూపాయి నిధులు ఇవ్వలేదని, గ్రామాల్లో అభివృద్ధి పనుల కింద తట్టెడు మట్టి కూడా పోయలేదని వారు అంటున్నారు. ఎమ్మెల్యేలకు నిధులు లేకపోవటంతో గ్రామీణ వనరుల మీద దృష్టి పెట్టి అవినీతికి పాల్పడుతున్నట్టు చెప్తున్నారు. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు చేయగలిగిన ప్రతి పనికో రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారని కరీంనగర్ జిల్లా తిమ్మాపురం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ దిగువ శ్రేణి నేత తన అనుభవాన్ని వివరించారు. రైతులు తోడుకునే ఇసుక, మట్టికి కూడా ట్రిప్పుకు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నట్టు చెప్తున్నారు. గతంలో ట్రిప్పుకు రూ.200 నుంచి రూ.300 వరకు గ్రామ సర్పంచ్ వసూలు చేసేవారని, ఇప్పుడు ప్రజాప్రతినిధులే నేరుగా అడుగుతున్నారని చెప్పారు. పోలీసుస్టేషన్‌లో ఇరుగుపొరుగు పంచాయితీలు, భార్యభర్తల పంచాయితీలలో ఎస్ఐకి ఒక మాట చెప్పమని ఎమ్మెల్యేలకు ఫోన్ చేస్తే మనకు ఏమన్నా ఇస్తారా అని అంటున్నారని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకుచెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వాపోయారు.

బీసీలకిచ్చిన హామీలేమయ్యాయి?

బీసీ సామాజిక యువకులు ప్రభుత్వం మీద తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బీసీ సంక్షేమం కోసం 65 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని చెప్పారని, ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్, మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారని కానీ ఒక్కటి కూడా అమలు చేయలేదని వారు మండిపడుతున్నారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్వయం ఉపాధి, ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల వరకు వడ్డీ రహిత తాకట్టు లేని రుణాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేం కేసీఆర్ వెంటే

పాలకులు హైదరాబాద్‌లో ఉండి మాట్లాడటం కంటే గ్రామాల్లోకి వచ్చి చూస్తే కాంగ్రెస్ పాలన ఎట్లా ఉందో అర్థం అవుతుంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు వృద్ధాప్య పింఛన్ టంచన్‌గా వచ్చేది. కాంగ్రెస్ రూ.4000 పింఛన్ అని హామీ ఇవ్వటంతో అవ్వాతాతలు కాంగ్రెస్ వైపు చూశారు. రూ.4000 సంగతి దేవుడెరురు రూ.2016 కోసమే కళ్లలో ఒత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. అన్ని వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకే ఇస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చింది. కేసీఆర్ రైతుల మీద ఈగ వాలనియ్యలేదు.

-మెంతబోయిన సింహాద్రి, కర్విరాల కొత్తగూడెం, సూర్యాపేట జిల్లా

మళ్లీ కేసీఆర్ రావాలె

పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు బిల్లులు ఇప్పిస్తామంటూ మాజీ సర్పంచులు, ఉప సర్పంచులను, ఎంపీటీలు, జెడ్పీటీలను ఎర వేసి లాగాలని కాంగ్రెస్ పార్టీ నేతలు చూస్తున్నారు. ఎన్నికలకు అయ్యే ఖర్చుకూడా భరిస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ ఒక్కరు కూడా ఆ పార్టీలోకి వెళ్లటానికి ఇష్టపడటం లేదు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే పరిస్థితి లేదు. జనం మళ్లీ కేసీఆర్ రావాలె అంటున్నారు.

- గూడెల్లి అంజనేయులు, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు
గునుకులకొండాపూర్, కరీంనగర్ జిల్లా

కాంగ్రెస్‌కు ఓటేస్తే పిల్లల మరణాలకు మద్దతిచ్చినట్టే

మా దగ్గర కాంగ్రెస్‌కు అభ్యర్థులే దొరకరు. మెజార్టీ గ్రామాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులనే ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి జనం సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. రెసిడెన్షియల్ స్కూల్ పిల్లలకు కనీసం పరిశుభ్రమైన ఆహారం పెట్టలేకపోతున్నది. ఈ ప్రభుత్వం నిలబెట్టిన అభ్యర్థులకు ఓటు వేస్తే స్కూల్ పిల్లల మరణాలకు మద్దతు తెలిపినట్టే.

- పర్శ కృష్ణ, దుబ్బాక, సిద్దిపేట జిల్లా

ఆ వెంచర్ అక్రమమే.. నిర్మాణాలను కూల్చేశాం

- సర్వే నం 30లోని ప్రభుత్వ భూమిని రక్షించాం
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ తహసీల్దార్ వివరణ
- 'మంత్రుల భూమాయ' కథనానికి ప్రభుత్వం స్పందన
- 2 నెలలపాటు పనులు జరిగినా స్పందించకపోవడంపై మౌనం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబర్ 30లో వేసిన వెంచర్ అక్రమమే అని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ భూమిలో వెంచర్ వేయడంపై 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు అమీన్‌పూర్ తహసీల్దార్ శుక్రవారం వివరణ ఇచ్చారు. సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు గుర్తించి సెప్టెంబర్ 21న మండల గిర్దావర్ ఆధ్వర్యంలో కూల్చేసినట్టు తెలిపారు. ఆ తర్వాత సైతం అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్టు స్థానికులు చెప్పడంతో నవంబర్ 19వ తేదీన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసుల సాయంతో రెవెన్యూ సిబ్బంది నవంబర్ 22న మూడు ఇండ్లను కూల్చేశారని, లేఔట్ కోసం చేసిన ఏర్పాట్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు. ఈ ఘటనలో సోహైల్ అనే వ్యక్తిపై నవంబర్ 23న కేసు నమోదైనట్టు వెల్లడించారు. మళ్లీ పనులు చేపట్టకుండా ఆ ప్రాంతంపై నిఘా పెట్టినట్టు చెప్పారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎలాంటి పనులు జరగడం లేదని వివరణ ఇచ్చారు.

రెండు నెలలు ఎందుకు అడ్డుకోలేదు?

తహసీల్దార్ ఇచ్చిన వివరణపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సెప్టెంబర్ 21న అక్రమ నిర్మాణాలు గుర్తించి కూల్చేసిన తర్వాత.. దాదాపు రెండు నెలలపాటు మళ్లీ వెంచర్ పనులు కొనసాగాయి. జేసీబీలు, టిప్పర్లు, భారీ లారీల ద్వారా భూమి మొత్తం చదును చేసి, బండరాళ్లను తొలిగించారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. మట్టి రోడ్లు వేసి, లేఔట్ చేశారని, మూడు ఇండ్లు నిర్మించారని వివరణలో స్వయంగా తహసీల్దారే చెప్పారు. మరి ఇంత జరుగుతున్నా రెండు నెలలపాటు రెవెన్యూ సిబ్బంది ఎందుకు అటువైపు కన్నెత్తి చూడలేదన్నది పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ ఘటనలో ఒక వ్యక్తిపైనే క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు చెప్తున్నారు. అయితే.. ప్రభుత్వ భూమిని కొల్లగొట్టి, ఇంత పెద్ద వెంచర్‌ను కేవలం ఒక్క వ్యక్తి వేయడం సాధ్యమేనా? అని ప్రశ్నిస్తున్నారు. పెద్దలను కాపాడేందుకే తూతూమంత్రంగా ఒకరిపై కేసు నమోదు చేయించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

పట్టాలు.. స్తంభాలు ఏం చేస్తారు?

గతంలోనే రద్దయిన ఓఆర్సీ సర్టిఫికెట్లతో ఇప్పటికే కొందరికి పట్టాలు వచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బై నంబర్లు వేసి తలా ఐదెకరాల చొప్పున కొందరికి పాస్‌బుక్‌లు మంజూరైనట్టు తెలుస్తున్నది. వెంచర్ అక్రమమే అని చెప్తున్న రెవెన్యూ అధికారులు ఈ పట్టాలను రద్దు చేస్తారా? అనేది వివరణ ఇవ్వాల్సి ఉన్నది. ఈ పాస్‌బుక్‌ల మంజూరులో క్షేత్రస్థాయి నుంచి పై స్థాయి వరకు ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వెంచర్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు, లైన్లు, ప్రహరీ, రోడ్లు ఎందుకు తొలగించలేదని ప్రశ్నిస్తున్నారు.

ఏడాది బర్బాది

'ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి అమలుచేస్తాం' ఇదీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా అశోక్‌నగర్ వెళ్లి విద్యార్థులతో కూర్చుని కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. కానీ రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఆచరణకు నోచుకోలేదు. పైగా పాత నోటిఫికేషన్లకే నియామక పత్రాలు ఇచ్చి, తామే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. హామీ ఏమైందని అడుగుతున్న నిరుద్యోగులపై లాఠీలు ఝుళిపిస్తున్నది.

-హైదరాబాద్(నమస్తే తెలంగాణ):

ఉద్యోగాలు ఉత్తముచ్చటాయె!

ఈ ఏడాదిలో 53 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. అయితే కేసీఆర్ సర్కారు హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించగా కేవలం నియామక పత్రాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని తన ఖాతాలో వేసుకుంటున్నది. ఏడాదిలో టీజీపీఎస్సీ నుంచి ఒక్క కొత్త నోటిఫికేషన్ జారీ కాలేదు. ఇక గురుకుల, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుల నుంచి ఒక్కటంటే ఒక్క కొత్త నోటిఫికేషన్ రాలేదు. ఆ నోటిఫికేషన్లన్నీ 2022, 2023లో వచ్చినవే. గ్రూప్-4 సహా పలు పరీక్షలను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్వహించారు. కొన్ని కోర్టు కేసుల కారణంగా నిలిచిపోగా, న్యాయస్థానాల్లో చిక్కుముడులు వీడటంతో ఇప్పుడు నియామకపత్రాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది.

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలకు కాంగ్రెస్ హామీ | అధికారంలోకి వచ్చాక కొత్తగా నింపింది సున్నా | పాత నోటిఫికేషన్లకు నియామకపత్రాల పంపిణీ

■ ఇత్తేసి పాత్తు కూడినట్టు

ఇత్తేసి పొత్తుకూడినట్టు.. అన్న చందంగా పాత నోటిఫికేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని కొత్త పోస్టులు కలిపి తామే ఉద్యోగాల భర్తీ చేపట్టినట్టు చెబుతున్నది. గ్రూప్-1కు కేసీఆర్ సర్కారు 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం మరో 60 కలిపింది. 5,089 టీచర్ పోస్టులకు గతంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వగా మరో 5,973 పోస్టులను కలిపింది. మెడికల్ పోస్టుల్లోనూ అంతే. నర్సులు, ఎంపీహెచ్ ఏలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు వంటి నోటిఫికేసన్లలో అదనంగా కొన్ని పోస్టులు కలిపి తామ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

■ జాబ్ క్యాలెండర్.. ఓ జోక్

జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటనతో సరిపుచ్చింది. దీనిని కూడా అమలు చేయడం లేదు. క్యాలెండర్ ప్రకారం అక్టోబర్‌లో గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ రావాలి. కానీ ఇప్పటికి కూడా నోటిఫికేషన్ విడుదల కాలేదు. విద్యుత్తు సంస్థల్లో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ పరిస్థితీ అంతే. ఫలితంగా జాబ్ క్యాలెండర్ ఒక జోక్‌గా మారింది. ఇయర్ క్యాలెండర్ పూర్తికావొస్తున్నా జాబ్ క్యాలెండర్ రాలేదంటూ నిరుద్యోగులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.

■ నిరుద్యోగులపై దమనకాండ

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు నిరుద్యోగులను మభ్యపెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు అదే నిరుద్యోగులపై దమనకాండను సాగిస్తున్నది. పోలీసులను ఉసిగొల్పి, నిరుద్యోగుల రక్తం కండ్ల జూస్తున్నది. ప్రభుత్వ తీరుతో నిరుద్యోగుల అడ్డా అయిన అశోక్‌నగర్, సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఇప్పుడు పోలీసులు, మఫ్టీ పోలీసుల అడ్డాగా మారింది. నిరుద్యోగులు చిన్నపాటి సమావేశం పెట్టుకుంటే వందల సంఖ్యలో పోలీసులు వాలిపోతున్నారు. ప్రెస్‌మీట్‌లో మాట్లాడే అవకాశం కల్పించడంలేదు. ఏదైనా నిరసన పిలుపు వచ్చిందంటే నిరుద్యోగులు, జేఏసీ నేతలను ఎత్తుకెళ్లడం, పోలీసు స్టేషన్లల్లో నిర్బంధించడం కాంగ్రెస్ పాలనలో పరిపాటిగా మారింది.

■ ఏడు రెట్లు అధికం

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 2004-2014 మధ్య 24,086 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసింది. ఇందులో తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల వాటా 10,080 మాత్రమే. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2014-2023 మధ్య 1,60,083 ఉద్యోగాల భర్తీ జరిగింది. అంటే ఉమ్మడి రాష్ట్రంలో భర్తీ చేసిన ఉద్యోగాల కన్నా ఏడు రెట్లు ఎక్కువ. ఒక్క తెలంగాణలోనే భర్తీ అయిన ఉద్యోగాలతో పోల్చితే సుమారు 15 రెట్లు అధికం. అయినా కాంగ్రెస్ ఇప్పటికీ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రచారం చేస్తున్నది. కానీ అసలు లెక్కలు ప్రజాక్షేత్రంలోనే ఉన్నాయి.



కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన నియామకపత్రాలు

నోటిఫికేషన్	జారీచేసిన తేదీ
గ్రూప్ -4	2022 డిసెంబర్ 1
డీఎస్సీ	2022 సెప్టెంబర్ 6
ఏఎంవీఐ (రవాణాశాఖ)	2022 డిసెంబర్ 31
ఏఈఈ (ఇరిగేషన్)	2022 సెప్టెంబర్ 9
పోలీసు ఉద్యోగాలు	2022 ఏప్రిల్ 25
గురుకుల టీచర్	2023 ఏప్రిల్ 5
స్టాఫ్ నర్సు	2022 ఏప్రిల్ 30

కేసీఆర్ హయాంలో ఉద్యోగాల భర్తీ వివరాలు

ప్రభుత్వ శాఖ	ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినవి	నోటిఫికేషన్ ఇచ్చినవి	ప్రాసెస్‌లో ఉన్నవి	నోటిఫికేషన్ ఇచ్చినవి
అగ్రికల్చర్	6,058	5,647	5,303	344
వెటర్నరీ, డెయిరీ, ఫిషరీస్	1,711	1,324	1,135	189
బీసీ వెల్ఫేర్	11,090	8,709	2,552	5,957
విద్యుత్ శాఖ	60,108	52,547	52,324	223
పర్యావరణం, అటవీ శాఖ	3,853	22,09	2,152	57
ఆర్థిక శాఖ	1,165	1,151	28	1,126
జీఏడీ	626	435	219	216
వైద్యారోగ్య శాఖ	23,176	16,712	8,132	8,580
ఉన్నత విద్యాశాఖ	4,336	3,246	0	3,246
హోంశాఖ	50,590	48,320	46,850	1,470
ఇండస్ట్రీస్	96	90	20	70
ఇరిగేషన్	2,300	2,162	895	1,267
కార్మికశాఖ	514	235	55	180
న్యాయశాఖ	18	19	12	7
అసెంబ్లీ	15	15	0	15
మైనార్టీ	5,839	5,549	3,745	1,804
మున్సిపల్ శాఖ	5,735	5,231	1,957	3,274
పంచాయతీ రాజ్	11,978	11,794	10,763	1,031
ప్లానింగ్	580	479	474	5
రెవెన్యూ	6,669	6,106	3,543	2,563
ఎస్సీ వెల్ఫేర్	7,456	6,575	3,770	2,805
పాఠశాల విద్య	16,271	14,513	9,143	5,370
ఎస్టీ వెల్ఫేర్	2,399	3,114	1,537	1,577
ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్	998	915	147	768
సివిల్ సప్లయిస్	88	88	0	88
టూరిజం, కల్చరల్	60	18	0	18
రవాణా శాఖ	6,579	5,732	5,327	405
మొత్తం	2,32,308	2,02,735	1,60,083	42,652

పార్టీ ఫిరాయింపులకు మేం వ్యతిరేకం

- కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ .. పార్టీ ఫిరాయింపులకు(ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం) వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపూరావును కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తమ పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకమని పేర్కొన్నారు. అంతలోనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించేలా.. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, మంచి ముహూర్తం చూసుకొని కాంగ్రెస్‌లో చేరతారని చెప్పడం గమనార్హం. రాజకీయాల్లో పార్టీలు మారడం సర్వ సాధారణమని తెలపడం విస్మయానికి గురిచేస్తున్నది.

500 ఎకరాలు.. 40 వేల కోట్ల భారీ స్కామ్

- ప్రభుత్వ భూమి కబ్జాకు మంత్రి దామోదర స్కెచ్
- సమగ్రవిచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే క్రాంతి డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ కీలక నేతలు రూ.40 వేల కోట్ల భారీ భూ కుంభకోణానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్ఎస్ నేత గోపగాని రఘురామ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పదెకరాల పట్టా భూమి మాటున 500 ఎకరాలపైగా ప్రభుత్వ భూమి కబ్జా చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అనుచరులు భూ రిజిస్ట్రేషన్లు జరుపుతున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 30లోని భూములపై కోర్టులో స్టే ఉన్నప్పటికీ ఎందుకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి? ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నది? కబ్జాకు సూత్రధారులైన మంత్రి దామోదరతో పాటు సహకరిస్తున్న అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? దీనిపై న్యాయ విచారణ ఎందుకు జరిపించడం లేదు?' అని నిలదీశారు. సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబర్ 30లో ఉన్న 720 ఎకరాల భూమిపై అక్రమాలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయని చెప్పారు.

ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు?

'సర్వే నంబర్ 30లోని భూముల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉన్నా 30/1,2 అంటూ బై నంబర్ సృష్టించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేశారు.. ఎలా రిజిస్ట్రేషన్ చేశారో ప్రభుత్వం చెప్పాలి' అని క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. అక్కడ ఎవరెవరు తిరిగారో ఏయే కార్లు ఆ ప్రాంతానికి వచ్చాయో తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తెల్లాపూర్‌తోపాటు అమీన్‌పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీల్లో ఇల్లు, ఇతర పర్మిషన్ పొందాలంటే మంత్రి దామోదరను కలవాలని అధికారులు సూచించడమేంటని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వ భూమిని రక్షించి, నిరుపేదలు, దళితులకు ప్లాట్లుగా కేటాయించాలని కోరారు. అవినీతి మంత్రులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

అత్యంత పేదలకే ఇందిరమ్మ ఇండ్లు

- నియోజకవర్గానికి 3,500 చొప్పున నిర్మిస్తాం
- గిరిజనులకు ప్రత్యేక కోటా: రేవంత్
- ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఆవిష్కరణ
- 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- కేసీఆర్, ప్రతిపక్ష నేతలకు ఆహ్వానం

ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రీన్ చానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తామని చెప్పారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేస్తామని, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఐటీడీఏల పరిధిలోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇస్తామని తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి నమూనా సూచించడం లేదని, ప్రతి మండల కేంద్రంలో మాడల్ హౌజ్ నిర్మిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సైతం వినియోగిస్తున్నామని, పునాది నుంచి స్లాబు వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. సచివాలయంలో డిసెంబరు 9న జరిగే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తోపాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నే